# వితంతువు

చలికాలం. ఈ వూళ్ళో అదేమోకాని చలి ఎక్కువ. మంగమ్మ నా శాలువా కప్పుకుని నిద్రపోతోందనుకుంటా, మొగుణ్ణి వెచ్చగా కావిలించుకుని. నాకు ఇక్కడ చలి. నిద్రరాదు, కప్పుకోడానికా యేమీ లేదు. ఈ వెచ్చనిపొయ్యి దగ్గర కూచుంటే కొంచం వొణుకు నయం. కాని నేల ఇంకా ఆరలేదు-యెక్కడో ఇంకా చలిదేశాలు వుంటాయట. అక్కడెట్లా వుంటుందో?-చిన్నప్పుడు నాన్న 'సిండరిల్లా' కథ చెప్పేవాడు. అట్లా వుంది నా స్థితి యిప్పుడు. ఐతే సిండరిల్లా చిన్నపిల్ల..... నాన్న బతికి వున్నప్పుడు ఎంత బావుండేది. కష్టమంటే తెలీదు. ఎవరన్నా దిగులుగాకనపడితే ఆశ్చర్యంగా వుండేది. నాన్న ఇప్పుడు నన్ను యీ అర్ధరాత్రి ఈ పొయ్యిదగ్గిర వొంటరిగా కూచోడం చూస్తే? యెంత యేడుస్తోడో? ఎన్నడన్నా నేనిట్లా అనాథనైపోతానని అనుకుని వుంటాడా? వొళ్ళో నన్ను కూచోబెట్టుకుని నా తల దువ్వుతో, చంపలు తాకుతో, "మా అమ్మ అంత అందమయింది లేదు. మా అమ్మనికింద కాలుపెట్టనీని మొగుణ్ణితీసుకొస్తా" అనేవాడు. అప్పుడు ఈ వెంకట్రావుగారూ, వాళ్ళూ నన్ను వొళ్ళల్లో కూచోపెట్టుకుని మిఠాయి పొట్లాలిచ్చి, చిన్నపాట వొస్తే చాలు, ఆహా ఆహా అని ఒకటే ఆనందించేవాళ్ళు. పదేళ్ళు కాలేదు. ఇంకా మొన్న అన్నయ్యతో మాట్లాడుతో ఆయనే ఆ వెంకట్రావుగారే మొహం తిప్పేశాడు నన్ను చూసి.

అదుగో-పిల్ల లేచి ఏడుస్తోంది. మంగమ్మ లేవదేం? నేనైతే అట్లా ఏడవనిస్తానా? పొద్దస్తమానం ముద్దాడుతుంది పిల్లని. ప్రేమ లేకపోలేదు. అదుగో లేచింది మంగమ్మ-పిల్లని కొట్టింది-ఏడుస్తోంది పిల్ల. పిల్లల్ని కొట్టడానికి వీళ్ళకి చేతులెట్టా వొస్తాయో? సాయంత్రమేగా అట్లా ముద్దెట్టుకుంది. ఆ నోటితోనేగా ఆ తిట్లన్నీ-నాకే బిడ్డ వుంటేనా తెల్లార్లూ నా చేతుల్లో ఎత్తుకుని వూయిస్తో, ఒక్కనిమిషం రెప్పవాల్చక జోల పాడతా. ఇట్లా చేతుల్లో నున్నని, మెత్తని వెచ్చని అబ్బాయిని పట్టుకుని రొమ్ముమనోట్లోపెట్టి అదుముకుంటే...ఎంత బావుంటుంది! అందులో నా రొమ్ములు ఇంత గుండ్రంగా, చిన్నగా, నున్నగా వుంటాయి. అబ్బాయి చిన్న లేత గులాబీచేతులు యెంత బావుంటాయో-ఇప్పుడీ మనోవేదనతో నిద్రరావడంలేదు గాని, అప్పుడా పరమానందంలో రాదు....అదుగో పోలీసువాళు ళ్ళ గావును ఆ యీలలు, ఈ వీధికే వొస్తున్నారు. వీళ్ళేట కన్నాలు వేయించేది. ఎందుకో ఊరికె అట్లా వూత్తారు? దొంగలుభయపడ్డానికేమో.....

మంగమ్మకి పిల్లవుంది. కొట్టే మంగమ్మకి, చీదరించుకునే మంగమ్మకి.ఆ పిల్ల యేడుస్తూనేవుంది. యేం? పిల్లకి పాలివ్వాలని వుండదూ? ఆ చిన్న తడుముకునే నోటికి, పిల్లి గావును! ఉష్ పో-నాకు పిల్లలుండకూడదూ? ఆయన బతికి వుంటేనా, నాకీపాటికి ముగ్గురు నలుగురు పిల్లలుండేవాళ్ళే, నేను గొడ్రాల్నయ్యేదాన్ని కాదు. బిడ్డల సంగతి

తలుచుకుంటేనే నా కడుపులో ఇట్లా కలియబెట్టినట్లుందేనాకు పిల్లలుండకపోయేవాళ్ళా! చీదరించుకునే ఇట్లాంటివాళ్ళకే వుండగా లేంది? మొన్నవాడు జుట్టుపీకితే ఎందుకు పుట్టావురా వెధవా అంది మంగమ్మ. ఇంకోసారి "చచ్చావన్నాకాదు, పీడ వదిలిపోను" అంది. నా జుట్టు అటాంటి చిన్నచేతులతో ప్రతి వెంట్రికా నెత్తురు కారేటట్టు పీకించుకుంటాను.

ఆ మంగలాడు గొరగడం కంటె నయం కాదూ?--- నా వెంట్రికలు తీసేస్తారుట. తీసెయ్యనీ. చీదర వొదులుతుంది. వుండి యెవరికని? గొరిగేటప్పుడు మంట పుడుతుంది గావును. మరి మొగాళ్ళు ఏడవరే? మంటవుండదు. కాని గొరగడం తలుచుకుంటే యిప్పుడే భయం పుడుతోంది. భయమేకాదు-గొరిగేప్పుడు మంగలాడు మెడమీద చెయ్యేస్తాడు గావును! మొన్న అన్నయ్యమీద చెయ్యివేశాడు. వొళ్ళు ఝుల్లుమనదూ? పెళ్ళిలో తాళి కట్టేప్పుడు ఆయన చిటికెనవేలు తగిలేప్పటికే వొళ్ళు పులకరించింది. మీద చన్నీళ్ళు పోసుకున్నట్టు.... మొన్న లక్ష్మీకాంతం తాళపుచెవిలిస్తో అజాగ్రత్తగా అతనివేళ్ళు నా చేతికి తాకనిచ్చేటప్పటికి అన్నయ్య కళ్ళెర్రచేశాడు. అదివరకు నేనేమీ అనుకోలేదు కాని, అన్నయ్య పడే అనుమానాన్ని చూసి, నాకు లక్ష్మీకాంతమంటే సరదా పుట్టింది..... నన్ను తనయింటో పెట్టుకున్న కాలాగ్నిమల్లే చూస్తాడనకుంటా అన్నయ్య. లక్ష్మీకాంతాన్ని చూసి కళ్ళెర్రచేశాడు. కాని మంగలాడు నా మెడమీద చెయ్యేస్తే యేమంటాడో అన్నయ్య?

ఈ పిల్లి బాగా మరిగింది పాలు తాగడం. ఈవాళ పాలు అందడంలేదు. గోలపెడుతోంది. ఆకలి, దానికి. పాపం నాకుమల్లేనే నిద్ర పట్టదు. పోనీ యెలికల్ని పట్టరాదూ?..., నా శాలువ కప్పుకొని మొగుడి పక్కన మంగమ్మ నిద్రపోతున్నట్టుంది మళ్ళీ. తెల్లార్లూ ఆ గదిలో ఏం చేస్తారో తలుపులు మూసుకుని? ఆయనే బతికి వుంటే నేనేం చేస్తో వుండేదాన్ని? నన్నిట్లా పొయ్యి దగ్గర కూచోనిచ్చేవాడా! చిన్నవాడే! ఎట్లా ఆ రోగం వచ్చిందో కాని? కార్యమయినా అయితే బావుండేది. అంతా తెలిసేది. ఏం చేస్తారో తెలుసు. కాని ఎట్లా చేస్తారో, అప్పుడు వొళ్ళు ఎట్లా వుంటుందో తెలియాలని వుంది. కొందరు ఏడుస్తారు, ఎవర్నన్నా అడగాలని వుంటుంది. సిగ్గు, భయం, చెప్పరనుకుంటా. వాళ్ళకీ సిగ్గే. అప్పుడు సిగ్గు వుండదేమో! మాట్లాడ్డం మాత్రం సిగ్గు. నీకెందుకంటారు! ఒకవేళ ఒక బిడ్డకూడా వుండేదేమో? ఆయన కళ్ళుబావుండేవి. ఆకళ్ళేవొచ్చేవి అబ్బాయికి. నాచిన్న ఎర్రనినోరు వొచ్చేది. ఎంత బావుండేవాడని! అప్పుడు యీ వొదిన్ని యేమైనా లెఖ్ఖచేసేదాన్నా మా నాన్న యిచ్చిన శాలువ లాక్కొని మంగమ్మ కియ్యనిచ్చేదాన్నా! అబ్బాయికి కావాలనే దాన్ని. ఇప్పుడు తెల్లారకట్టే లేచి మంగమ్మ కొడుక్కివేణ్ణీళ్లు కావాలంటే ఎంతో కష్టంగా వుంటుంది. అప్పుడు నా బాబుకోసం యెన్ని నీళ్ళన్నా సంతోషంతో కాచేదాన్ని కదూ! ఇప్పుడైనా పుట్టకూడదూ! మొగాడు లేకుండా కనే పద్ధతిలేదూ? చెట్లకి కాయలు కాయటంలా? పోనీ ఒకబ్బాయి యెక్కడైనా దొరికితే బావుండును! అట్లా కాదు. కాదు.

నాలోంచే రావాలి. నా అబ్బాయికోసం.... అట్లాకాకపోతే మంగమ్మ కొడుకుమీద నాకు ప్రేమ వుండకూడదూ?....నిద్ర వొస్తోంది. కొంచెంగా పడుకుంటే రాదు మళ్ళీ చలి.

నా ఖర్మంట! ఏదో పాపం చేశాను. పూర్వజన్మంలో ఎవరి పిల్లల్నో చంపానుకుంటా. వొచ్చే జన్మలోనైనా పిల్లలుంటారేమో! వొచ్చేజన్మంలో పిల్లలుండడానికి ఇప్పుడేం చెయ్యాలో? శాస్త్రుల్లగారిని అడగనా! వొదినకి తెలిస్తే యింకేమన్నావుందా! పిల్లలుండాలనుకోటం తప్పా! పోనీ వొచ్చే జన్మంలో వుండాలనుకోడమూ తప్పే ఆ ముసలి ముత్తైద యాభై ఏళ్ళది, వున్న కొడుకుని, ఆవుపత్యం చేయించి చేతులార చంపుకుంది. ఆమె వొచ్చి పిల్లలులేరని ఏడిస్తే అందరూ వోదారుస్తారు. పద్దెనిమిది ఏళ్ళులేవు; నేను పాలిచ్చుకోడానికి ముద్దు చెయ్యడానికి, ఆడుకోడానికి పిల్లకావాలంటే ఎందుకు తిట్టడం? సిగ్గుమాలిన ముండ దీన్నింటో వుంచకూడ దంది వొదిన. బయటికనకూడదు. ఇట్లా రాత్రు లాలోచించాలి.... మళ్ళీ గస్తీ యీలలు. ఈ పోలీసువాళ్ళేట దొంగతనాలు చేయించేది....ఒక్కపిల్ల వుంటేచాలు ఆడపిల్ల ఐనా సరే. వొద్దు వొద్దు ఆడపిల్ల వొద్దు. నాకు వెధవ ముండే పుడుతుంది. నాకుమల్లే యిట్లా యాడవాలి......నాకు నిద్ర వొస్తోంది. కాని యీ చలిలో యెట్లా నిద్రపడుతుంది? శాలువుంటే బావుండును. హాయిగా మంగమ్మ కప్పుకొని నిద్రపోతోంది. నేను మాత్రమిట్లా ఎందుకని బాధపడాలో......మరి చేసుకున్న కర్మ ప్రకారం యిందరు ఆడవాళ్లు బిడ్డలులేకుండా ఇట్లాంటి విచారంతో చస్తోవుంటే, మొగవాళ్ళ కొక్కరికీ ఇట్లాంటి కర్మ పట్టదేం? పెళ్ళాం పోతే పెళ్ళాం తయారవుతుంది. అందరూ పాపాలు చేసేవారేగా? ఏదో మేముమాత్రం చేసే పాపం వొకటుండాలి. వెధవలయ్యే పాపం. మళ్ళీ యిక పెళ్ళిగాని పాపం. మళ్లీ తక్కిన వెధవలు చెయ్యరది. హిందూ విధవలే. మొన్న శాస్త్రుల్లుగారంటున్నారు. ఈ వ్రతాలూ, పూజలూ, యాత్రలూ చెయ్యడం వల్ల స్వర్గం వొస్తుందట. మరి ఆ స్వర్గంకోసం అందరూ వెధవముండలుకారాదూ? ఎక్కడో వెధవ ముండలకీ మళ్ళీ పెళ్ళి చేస్తున్నారట! అప్పుడు మళ్ళీ జుట్టు పెంచుకుంటారా! వెధవముండల్ని చేసుకునే వాళ్ళెవరుంటారో!

కర్మమెట్లానైతేనేం. నాకు పిల్లలు కావాలి. ఒకవేళ వెధవనై కూడా బిడ్డనికనే రాత వుందేమో! ఆ బిడ్డను ఈ జన్మంలో కని పెంచేపుణ్యమో, పాపమో పూర్వజన్మంలో చేశానేమో? అప్పుడు మరి వీళ్ళందరూ యామంటారు? వొదిన చంపేస్తుంది. అన్నయ్య తరిమేస్తాడు. నా కర్మం ప్రకారం అట్లా రాసివుంది నేనేం చెయ్యనంటే, వొప్పుకుంటారా? నాకు ఆ పెనిమిటికే వివాహం కావాలని, ఆయన చావాలనీ, నేనిట్లా కావాలనీ, అన్నీ రాసివున్నాయట. నేను పిల్లని కనాలనీ, రాసివుండకూడదూ? వీళ్ళు చూసి వొచ్చారా. ఇంక నామీద కోపమెందుకూ? డబ్బుందని ఆ రోగిష్టి మొగుణ్ణి కట్టడం నా కర్మం. బిడ్డని కంటే నన్ను వెళ్ళ కొట్టడం వీళ్ళకర్మం. ఇట్లా ఆడవాళ్ళందరూ యాడవడం యీదేశం కర్మం. పోనీ జాలన్నా చూపించరు. యెవరన్నా వాళ్ళ పూర్వజన్మ దుష్కృతం కొద్దీ, గుడ్డివాళ్ళయితే,

కుంటి వాళ్లయితే, జాలిపడతారు. నాకు ఆ దుష్కృతం.....కాదు....సుకృతం కొద్దీ బిడ్డపుడితే జాలిచూపరు. అట్లా రాసివుండంది నాకు మాత్రం బిడ్డ పుడుతుందా యేం? వెధవనైతేనే జాలిలేదే వీళ్ళకి పోనీ బిడ్డమీదనన్నా జాలి వుండదు. మళ్లీ జాలి కలవాళ్ళే; నాకుమాత్రం చూపరు. ఎందుకో!........ యీ యెలికలు నన్ను కూడా కరవ్వగదా; ఒకవేళ ఆ కిటికీలోంచి దొంగొస్తాడేమో.......మొన్న ఆవుపెయ్య యెంత కష్టపడ్డది! అదిచూసి వెంటనే యెద్దును తెప్పిచ్చారు. యెందుకూ! వీళ్లకి పాలూ దూడలూ కావాలికనక. మరి నాకు పిల్లలు కావాలి. కర్మం ప్రకారం మొగుడుపోయినాడు. కర్మాన్ని జయించి నేను ఆ సౌఖ్యం సంపాయిస్తానంటే వీళ్ల కెందుకో కోపం!.....వొదిన పుట్టింటి కెళ్ళినప్పుడు అన్నయ్య సుబ్రహ్మణ్యంగారితో అంటున్నాడు సిగ్గులేకుండా, భార్యలేకుండా, వంటరిగా వుండడం కష్టమని! నాకు కూడా అట్లానే వుందని పైకి అంటే ఆకాశంముక్కలై కిందపడ్డట్టు చూస్తారు..... చలి యెక్కువౌతోంది. పొయ్యికూడా చల్లబడ్డది.... అందరూ అన్నంతింటారు. కొందరికి అన్న తినడంకూడావుండే కర్మం కాలదు. అట్లా కాలినవాళ్ళూ, ఆ కర్మాన్ని జయించి అన్నం దొరికించుకొని తింటే, ఎవరూ ఏమీ అనరు. కాని కొందరికి యిట్లా కర్మం కాలుతుంది. ఈ బాధ వోర్చుకోవలసిందేగాని, తీర్చుకోవలసిందికాదు...... మృగాలకి ఇట్లాంటి కర్మంపట్టదు....అయ్యో! ఆవునో, కోడినో ఐ ఎందుకు పుట్టలేదో నేను; మళ్ళీ మనుష్యజన్మ గొప్పది అంటారు. మనుష్యజన్మం గొప్పదేకాని వితంతుజన్మం కాదు. ఎవరూ ఒక్కరూ, హృదయం దగ్గిరిగా చేర్చుకోడానికి లేకపోయింతరవాత బతకడం మెందుకు! పిల్లలులేని వితంతుజన్మం ఏమవసరమో ఈశ్వరుడికి! ఏమిటోబాధ, ఆశ, కల-నాలోపల. మొగవాడివల్ల తీరుతుంది గావును! ఏమిటో శూన్యం, లోపం.

## 2

అయిందానకి విచారంలేదు. కాని కొంచెం భయంగా మాత్రం వుంది. భర్తేవుంటే, ఈపాటికి సూడిదలూ, ఉత్సవాలూ! ఇప్పుడు వెలి. అప్పుడు రహస్యంగా వొదిన చెవులో చెబితే, నవ్వి చెంపమీద కొట్టి వుండేది. ఇప్పుడు చెవి కాలినట్టు అదిరి పడుతుంది. అప్పుడూ యిప్పుడూ ఒకటేకదూ! అసలు సృష్టి ఒకటే విధంకద! ఇప్పుడు ఒకసారి జరిగింది. అప్పుడు ఎప్పుడూ అదే-.....లోపల కదులుతోంది. అప్పుడే తెలుసునుగావును, నేను తన అమ్మనని. ఎప్పుడూ నన్ను లోపల లోపల తాకుతో వుంటుంది. ఆ పెద్దకళ్ళూ, చిన్నికాళ్ళూ పెద్దవతున్నాయి గావును-నాకు మంగమ్మ కూతురంటే చీకిరికళ్ళ పిల్ల పుడుతుందా? ఎప్పుడూ నన్ను ముక్కు కారుకుంటూ--మళ్ళీ మొగవాడి మొహం చూడను. వాడు నేను తనని వలిచే వొప్పుకున్నాననుకుని వుంటాడు? నా పుట్టబోయే బాబుకి వాడిపెద్ద కళ్ళు రావాలని సరేనన్నాను, నావంక యోధుడివలె. జయించిన వాడివలె చూస్తాడు దరిద్ర వెధవ- ఎలా మండుకొస్తుంది- వాడికిచ్చిన చనువుకి నాకు డోకువుస్తుంది. తన వెధవ అందం చూసి నిలవలేక, భ్రమిసి, నా వొంటిమదం అణుచుకోలేక భంగపడివాడికి

ప్రాధేయపడ్డాననుకున్నాడు. ఈసారిదగ్గిరికి రానీ మొహంమీద ఉమ్మేస్తాను. కాని పాపం, నాకీబిడ్డ నిచ్చినవాడే, నాబిడ్డతండ్రేఅని మళ్ళీఎందుకో చెప్పరాని ప్రేమ కలుతుంది.అదిసహజమేమో! కాని ఆరాత్రి వాడికి నేను లోకువ కావడం అది తలుచుకుని భరించలేను అప్పుడు ముద్దుగా, గౌరవంగానే మాట్లాడాడు. కాని వాడి కళ్ళలో ఎంతో చులకనయ్యే వుంటాను నేను. ఇట్లా నీచంగా ఏ మొగాడికో లోబడిగాని, వాడికి వొంటిని, పవిత్రమైన వొంటిని, వాడి మోటుచేతులకివప్పచెప్పి, ఎట్లా వుపయోగించినా వూరుకుని-ఛీ! ఛీ! ఆ యెంగిలి......పాడు....నలిగిపోయిగాని. కనడానికి, పుత్రభిక్షని పొందడానికి. వీల్లేక పోవడమేమిటో! ఛీ ఛీ! వెళ్ళిపోయేటప్పుడు వాడు, ఎంత లోకువగా మాట్లాడడు! ఈ మొగాళు ౄ చూపే గౌరవం దొంగగౌవరమే! బతిమాలడం వాళ్ళకే బావుంటుంది గనక బతిమాలతారు. ఆట! కాని వాడి వూహ! నేను ప్రాధేయపడ్డాననేగా! అంతా నటన! ముందు 'నేనున్నానుగా? నేను రక్షిస్తానుగా!' అని అవరసమేమీ లేకుండానే అని, నా భుజంమీద చెయ్యేసి, ఎవరో విరోధులున్నట్టు దిఖ్కరించి నుంచున్నాడయ్యా! తరవాత పాదాలు చప్పుడౌతున్నాయనేటప్పటికి, ఆషర్టు చంకనపెట్టి గుమ్మంలో నక్కాడు. అంతా మాయ. అట్లా ఆడదాన్ని రక్షిస్తున్నట్టుగా నుంచుంటే, వాళ్ళ మనసుకి శాంతిగా వుంటుంది. నా ధైర్యంలో యిరవయ్యో వంతులేదు. వాడు వెడుతో, 'భయంలేదులే' అంటాడు పైగా. చిరునవ్వుతో, వెకిలిగా "జాగర్త, ఆ వెంకటేశ్వర్లుకూడా కన్నేశాడు. వాడివేపు చూశావా, చంపేస్తా. వాణ్ణీ నిన్నూ!" ఒక్కరాత్రి, ఒక్క అరగంట వాడికి లోకువై నానని, నాపైన అంత అధికారమూ, స్వతంత్రమూ వొచ్చాయి వాడికి! ఛీ పాడుజన్మ! ఈ ఆడజన్మ!...... నిజంగా యింక నాకు బిడ్డపుట్టి తీరుతుందికదూ! ఆ చిన్న గులాబి గుప్పెట్లు పట్టుకుని చిన్న చిన్న కళ్ళు మూసుకుని, పగడంవంటి నోటితో, పాలకి తడుముకొంటో, యీ, యీ, అంటూ.....అమ్మోయ్!

వీళ్ళకెప్పుడో ఒకప్పుడు తెలుస్తుంది ఎన్నాళ్ళు దాచగలను యిట్లా? పోయిన నెలకూడా, బయటకూచొని, నాటకమాడాను....వొదిన కొడుతుంది. ఏమైనాసరే బయట తెలియకూడదంటాడు అన్నయ్య. వొదిన వెళ్ళకొట్టమంటుంది. అన్నయ్య వొద్దంటాడు. కాని కేకలు వేసే వొదినే నయం. ఆ రహస్యంగా వుంచమనడం నాకోసమా? కులం వెలిపడీ నా అనేవాళ్ళులేక, నా మొహంమీద వుమ్మి వేయించుకొంటో, వొంటరినై, భ్రష్టురాలనయ్యే నా సంగతి ఆఖ్కర్లేదు; ఏపాపం ఎరక్క నిర్భాగ్యురాలికి, నాకు పుట్టేదిక్కుమాలిన, నా పిల్లల సంగతీ ఆలోచించడు. యిరుగు పొరుగునా కచేరీలోనూ తన చెల్లెలిట్లా చేసిందంటే, తన పరువు పోయిందనే దిగులొక్కటే అతనికి-మళ్ళీ చిన్నప్పుడు అన్నయ్య బళ్ళోంచి వస్తాడని, నా కాఫీకూడా అతని గ్లాసులోనేపోసి, అంతా అతనికే వేడిచేసి యిచ్చేదాన్ని. లస్టరుచిమ్నీ, తన బంతితో అన్నయ్య బద్దలుకొడితే, నేనని ఆ నేరం నామీద పెట్టుకుని,

దెబ్బలన్నీ నేను తిన్నాను. అవాళ రాత్రి నా బుజాల మీద చేతులేసి, "చెల్లీ ఎప్పుడూ మరిచిపోను. ఇంకెప్పుడూ నిన్ను కొట్ట"న్నాడు. ఆవేళ నాకెంత సంతోషం వచ్చిందని! ఇప్పుడు అన్నయ్య దయగా ఒకమాట మాట్లాడడు.....

నాకు చచ్చిపోయిన తరవాత నరకం అంటకుండాను నా శరీరాన్ని ఇంత అందంగాచేసి, రగిలే ఈ కోర్కెని హృదయంలో సహజంగా పుట్టించి, నాకు వీళ్ళిచ్చిన మొగుణ్ణి చంపి, పైగా నన్ను నరకానికి పంపుతాడా దేవుడు! మంగమ్మకి కొడుకుపుట్టినందుకు స్వర్గమా! పిల్లల్ని కొట్టేమంగమ్మకి! లేకలేక కష్టపడి ఈ బిడ్డను తెచ్చుకొని కన్నందుకు నరకమా! ఆ దేవుణ్ణి అడగనూ నాటకానికన్నా వెళ్ళనీకండా, ప్రతి రాత్రీ అన్నయ్యని తనకి కట్టేసుకునే వదినకుండదూ, నరకం! అంతా అబద్ధం. దేవుడికిలేదు నామీదకోపం. నన్ను భయపెట్టడానికి అన్నారు. అప్పుడే మా చిన్ననాన్నా బొజ్జలోకి పాలు ఏర్పడుతున్నాయి. దేవుడికే కోపంవుంటే అబ్బాయి పుడతాడని ముందే యోచించి ఆ బంగారు బొజ్జలోకి బువ్వ తయారు చేస్తాడా! అంతా అబద్ధం. వీళ్ళకి తెలియకపోతే దేవుడికి తెలీదూ నాబాధా, నా స్వభావమూ, ఆలోచనా!-నేనే కావలసినవారు, నన్నే ప్రేమించేవారు, నన్ను బతిమాలి గోముచేసి "యెంతకోపం నామీద" అని గడ్డంపట్టి తమవేపుతిప్పుకునేవారు వుండాలని ఎంతో మనసు లాగుతుంది. ఏ మొగాడు ఏ ఆడదాన్ని ప్రేమగా చూచినా, ఆపాదమస్తకం మండిపోతుంది! నన్నో! నన్నో! నాకో! నాకో! అని ప్రతి నరం అరుస్తుంది. నామీద ప్రేమలేనివాళ్ళకి, జన్మమంతా రెక్కలకష్టం పోసి ముసలిదాన్నై చస్తే ఎవరు సంతోషించను? అంతకంటే నన్ను ఒక్కరాత్రికైనా సరే కావాలనేవాడికి నా దేహమిచ్చుకుంటే పాపమా! సోమరిమల్లే పగలు తొమ్మిందిటిదాకా పట్టెమంచంమీద దొర్లేవొదినకి కాఫీకాచడం పుణ్యమని ఏశాస్త్రాల్లో వ్రాసి వుందో! ఇట్లాంటి కోరికలు, ఇంతమంది వితంతువులు వున్నారే, వాళ్ళందరికీ వుంటాయా? వాళ్ళెవరూ నాకుమల్లే గోలపెట్టినట్టు కనపడరే? వాళ్ళు మంచి వాళ్ళేమో! నాకొక్కదానికేనేమో యీ దుర్బుద్ధి! కాదు. నేనూ పైకి ఏ మెరగనట్లే కనపడతాననుకుంటా. బైటికందరూ అంతే! లోపల...ఎవరినన్నా రహస్యంగా అడగనా? అడిగితే, ఛీ ఛీ! పొమ్మంటారు! నేననమా? అట్లానే తమాషా. నేనుమాత్రం అందరంత మంచిదాన్ని కానాయేమిటి? రోజూ జపంచేస్తాను. వాళ్ల బుల్లెమ్మ మల్లే తాంబూలాలు వేస్తానా? పరుపులమీద పడుకుంటానా? బ్రాహ్మడికి ప్రతినెలా పెట్టుకుంటున్నాను. మొన్న స్వాములవారి తీర్థం పుచ్చుకున్నాను. నాకుమాత్రం భర్తే వుంటే నేను మంచిదాన్ని కాదూ? అప్పుడు యీ పని వొద్దనడం. పిల్లల్ని కనకపోవడం, తప్పు, అపరాధం. పన్నెండేళ్ళు నిండకముందే మొదలుపెట్టి అరవైయ్యే యేటిదాకా, ఒక రోజూ వ్యవధిలేకుండా కాపరాలు చేసే యీ ముత్తైదలని చూస్తేయెవరికీ విపరీతంగా కనపడదేం? భర్తపోగానే కోర్కెలుకూడా చస్తుందావాడితో కూడా? వాడిచితిమీద కాలుతుందా?..... ఎవరినన్నా కన్నెత్తి చూస్తేచాలు; ఇల్లంతా తల్లకిందులుచేసి రాగాలుపెట్టి,

పరాయి ఆడదాన్ని గడపతొక్కకుండాచేసి, తమ మొగాళ్ళని తమ వుపయోగార్థమే దాచుకుంటారే! ఎన్నడూ మొగాణ్ణి యెరగని దానికి నాకు మాత్రం అట్లా వుండదూ?

నా సంగతి తెలిస్తే వీళ్ళూరుకోరు. కాని నన్నింటోంచి బైటికి పోనీరు. నా బిడ్డని యెవరికో ఇప్పించి మళ్ళీ నన్ను చాకిరీకి తెచ్చుకుంటారు. నేనెక్కడన్నా నా బాబుతో సుఖంగా బతుకుతున్నా వీళ్ళు వోర్చుకోరు తమదైన హక్కును తమకి భుక్తమైన సొంత సౌఖ్యాన్ని నేను దొంగిలించినట్టు ఏడుస్తారు. సూర్యనారాయణ చెల్లెలిని నలుగురూ నన్నూ నా బిడ్డతో సహా చూపిస్తోంటే, అన్నయ్య సహించగలడా?

కాని, నేనొప్పుకోను, నా బాబుని, నా చిట్టి బంగారాన్ని ఎవరికీ ఇవ్వను. నాకు తప్ప వాడిమీద ఎవరికి వుంటుంది దయ! మామయ్యలూ అత్తయ్యలూ, తాతయ్యలూ వీళ్ళకీ వుండదే కనికరం! పరాయి వాళ్లకి వుంటుందా? నే నివ్వనీను. నేనే పెంచుకుంటా. నన్ను వీళ్ళేం చేసినాసరే. గోలచేస్తా, యేడుస్తా. వెళ్ళిపోతా. కాని, నా బాబుని లేకలేక నా చేతుల్లోకి వొచ్చిన నా భాగ్యాన్ని పారేసుకోను, నా ముద్దులమూట చిరునవ్వొక్కటి చూడకుండా వుంటానా? నేను స్వతంగా పాలిచ్చుకుంటా నాబాబు నన్ను గుర్తుపడితే ఇన్ని కష్టాలు, వెలీ, తిట్లూ, అన్నీ తనకోసమే, అని తెలుసుకుంటే, నన్నూ, నా మోహాన్నీ, గుర్తుపట్టి, చేతులు జాచి, నావేపు "అమ్మా" అంటే, పకపక రత్నాలు నవ్వితే, నామీదే అంత ప్రేమా చూపితే నాకింకేం కావాలి?-వీళ్లకి నా బిడ్డమీద కూడా కోపం ఎందుకొస్తుందో? నేనంటే పోనీ అపరాధం చేశాననుకోవచ్చు. నోరెరగని ఆ పసిగుడ్డేంచేసింది? ఒకవేళ నన్ను వాళ్లల్లో వుణ్ణిచ్చినా వుంటానా! వాడిముందు నన్ను లోకువగా చూస్తే నేను భరించగలనా? వాణ్ణి తిట్టి, వాడిచేత చాకిరీ చేయించుకుంటే-ఎక్కడికన్నా వెళ్ళిపోతా-యెక్కడికో. నాన్న అంటే ఏమననూ? చచ్చి పోయినాడంటా. కాదు..... "నేనే నీనాన్న" అంటా.

◆ ◆ ◆

*రచనాకాలం : 1927*

*ప్రచురణ : (కర్మమిట్లాకాలింది కథల సంపుటి) స్టూడెంట్స్ బుక్ సెంటర్*